నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ అమ్మవారు

గుర్రంకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా పూజలను నిర్వహించారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసరును తాగి ఆలయంలో ఒరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పింఛా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

సుండుపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు నిండటంతో ఆ ప్రాజెక్టు నుంచి దిగువకు సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ నీరు విడుదల చేయనున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు పింఛా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నిండింది. ప్రాజెక్టు నుంచి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. కలెక్టర్‌తో పాటు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు హాజరవుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు కళ్లే రెడ్డెప్ప తెలిపారు.

అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజాదర్బార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి అడ్డు లేదు, సంక్షేమానికి తిరుగులేదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అలాగే ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొంత మంది అధికారులు, నేతలు, ప్రజలు మంత్రిని సన్మానించారు.

డీటీఈ యాప్‌పై విచారణ

కురబలకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌తో మోసపోయిన డీటీఈపై ఇంటెలిజెన్స్, పోలీసులు విచారణ చేపట్టారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో డీటీఈ యాప్‌తో మోసపోయారు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఆదేశించింది. దీంతో పోలీసులు, ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ చేపట్టారు.

గండికోట ప్రాజెక్టులో 20.38 టీఎంసీల నీటిమట్టం



7



కొత్త బార్లకు నేడు నోటిఫికేషన్

● జిల్లాలో పెరగనున్న బార్ల సంఖ్య
● లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయింపు
● 15 శాతం ఏఈఆర్‌టీతో బార్లకు డిమాండ్ పెరిగేనా..?

మదనపల్లె టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీ విధానంలో నూతన బార్ల ఏర్పాటుకు రెండు జీవోలు విడుదల చేసింది. అందులో 275 జీవో ప్రకారం ఎక్సైజ్ శాఖ పాలసీ 276 జీవోఎంఎస్ ప్రకారం నిబంధనలు విడుదల చేసింది. మూడేళ్ల పాటు లైసెన్స్ ఇవ్వనున్న ఈ బార్ల కేటాయింపును వైసీపీ ప్రభుత్వంలో వేలం పాటలు నిర్వహించగా, కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం ప్రైవేటు మద్యం దుకాణాల కేటాయింపులో పాటించిన లాటరీ పద్ధతిలోనే ఈసారి కొత్త బార్లకు లైసెన్సీలను ఎంపిక చేయనున్నారు. గతంలో ఈ-వేలం పాటల్లో రూ.కోటి వరకు పలికిన ఒక్కో బార్ లైసెన్సు ఈసారి కొత్త పాలసీ ప్రకారం కేవలం రూ.55 లక్షలు మాత్రమే పలకనుంది. దీంతో మద్యం వ్యాపారుల మధ్య పోటీ పెరిగనున్నట్లు ఎక్సైజ్ శాఖ యోచిస్తోంది. కానీ వైసీపీ ప్రభుత్వ తప్పిదంతో ఏఈఆర్‌టీ 15 శాతం పెంచడంతో అనుభవం గల మద్యం వ్యాపారులు ఆలోచనలో పడిపోయారు.

జిల్లాలో పెరగనున్న బార్ల సంఖ్య

జిల్లాలో ఇది వరకు 11 బార్లు, హార్సిలీహిల్స్‌లో ఒక టూరిజం బార్ నడిచాయి. ఈనెల 31వ తేదీకి ఈ బార్ లైసెన్సులు అన్నీ రద్దు కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకారం బార్ల కేటాయింపునకు సోమవారం (18వ తేదీ) నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇప్పటి వరకు జిల్లాలో 11 బార్లు ఉండగా, నూతన పాలసీ ప్రకారం మరో బార్ కల్లుగీత కులానికి చెందిన వారికి కేటాయించనున్నారు. దీంతో పాటు బి.కొత్తకోట లాంటి నగర పంచాయతీల్లో కూడా బార్‌ల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 సంవత్సరంలో ఈ-వేలం పద్ధతిలో బార్ల లైసెన్సీలను జారీ చేశారు. ఎక్కువ ధరకు బిడ్ దాఖలు చేసిన వారికి బార్ లైసెన్సులు కేటాయించారు. జిల్లాలో 11 బార్లు ఉండగా అందులో అధికంగా 4 బార్లు మదనపల్లె పట్టణంలోనే ఉన్నాయి. ఈ నాలుగు బార్లకు గాను గత ప్రభుత్వానికి రూ.3.58 కోట్లు లైసెన్సు ఫీజు ద్వారా ఆదాయం వచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం ఈ నాలుగు బార్ల లైసెన్సుల ఫీజును ఒక్కోదానికి ఈసారి కేవలం రూ.55 లక్షలు మాత్రమే కేటాయించింది. దీంతో బార్లను దక్కించుకునే వారి సంఖ్య పెరగవచ్చని తద్వారా ప్రభుత్వానికి కూడా గతంలో కన్నా ఆదాయం పెరుగుతుందని ఎక్సైజ్ శాఖాధికారులు భావిస్తున్నారు.



మదనపల్లెలో నిర్వహిస్తున్న ఓ బార్

15 శాతానికి పెరిగిన ఏఈఆర్‌టీ పన్నులు

అడిషనల్ ఎక్సైజ్ రీటైల్ ట్యాక్స్ (ఏఈఆర్‌టీ)... ఈ పేరు వింటేనే బార్ల యజమానుల గుండె గుబేల్‌మంటుంది. గత వైసీపీ ప్రభుత్వం చేసిన రూ.13 వేల కోట్ల అప్పులకు వడ్డీ చెల్లించేందుకు చేసుకున్న ఒప్పందమే ఏఈఆర్‌టీ. బార్లలో విక్రయించే మద్యం ఎమ్మార్పీకి అదనంగా 15 శాతం ఏఈఆర్‌టీ వసూలు చేస్తారు. కొత్త పాలసీ ప్రకారం కూడా బార్లలో విక్రయించే మద్యం ఎమ్మార్పీకి అదనంగా 15 శాతం ఏఈఆర్‌టీ పన్నులు చెల్లించాల్సిందే. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా, పర్మిట్ రూమ్‌లు లేకపోవడంతో బార్లు ఏఈఆర్‌టీ పన్నులు చెల్లిస్తున్నా లాభదాయకంగా నడిచాయి. మద్యం దుకాణాల్లో విక్రయించే ఎమ్మార్పీకే బార్ల యజమానులు ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి మద్యం కొనుగోలు చేసేది. దీనికి ఏఈఆర్‌టీ చెల్లించినా, బార్ల యజమానులు వారికిష్టమైన ధరలకు మద్యం విక్రయాలు జరిపి లాభాలు గడించారు. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక, ప్రైవేటు మద్యం దుకాణాలు రావడంతో బార్లకు తీవ్ర నష్టం కలిగింది. ఏడాదిగా బార్లు అన్నీ నామమాత్రంగా నడిచాయంటే అతిశయోక్తి కాదు. అలాంటిది ఇప్పుడు కొత్త బార్లకు లైసెన్సీ ఫీజులు తగ్గినా, ఎమ్మార్పీకి మద్యం కొనుగోలు చేసి ఏఈఆర్‌టీ పన్నులు చెల్లించి, ప్రైవేటు మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసే పర్మిట్ రూమ్‌లు (సెప్టెంబరు 1వ తేదీ నుంచి) పోటీ తట్టుకుని బార్ల లైసెన్స్ కోసం అనుభవమున్న యజమానులు దరఖాస్తు చేసుకుంటారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నే.

14 గంటలు తెరుచుకోనున్న బార్లు

నూతన బార్ పాలసీ ప్రకారం గతంలో కన్నా భిన్నంగా బార్లు రోజులో 14 గంటల పాటు తెరుచుకోనున్నాయి. గతంలో బార్లు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే పనిచేసేవి. ఇప్పుడు మారిన విధానం ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లు తెరుచుకోనున్నాయి. కాకపోతే బార్లలో చీప్ లిక్కర్ (రూ.99 క్వార్టర్ బాటిల్ మద్యం) మాత్రం విక్రయించకూడదు.

బార్‌లు దక్కించుకోవాలంటే...!

ఈనెల 31వ తేదీ బార్ల పాత లైసెన్సులు రద్దు కానున్నాయి. సెప్టెంబరు 1వ తేదీ నుంచి కొత్త బార్ పాలసీ అమలులోకి రానుండగా, కొత్త లైసెన్సులు దక్కించుకోవాలనుకునే వారు, ఈ కింది నిబంధనలు పాటించాల్సి ఉంది. ఈసారి బార్ లైసెన్సు కోసం ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ పద్ధతిలో లక్కీడిప్ ఎత్తి అదృష్టవంతుడికి బార్ లైసెన్సు కేటాయిస్తారు. ఒక్కో దరఖాస్తుకు రూ.5 లక్షలు (నాన్ రీఫండబుల్ ఫీజు) చెల్లించడంతో పాటు అదనంగా మరో రూ.10 వేలు చెల్లించాలి. నాలుగు పైన ఎక్కువ దరఖాస్తులు వచ్చినా వాటిని కూడా లక్కీడిప్ బాక్స్‌లో వేసి లాటరీ ఎత్తుతారు. 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో ఒక్కో బార్‌కు ఎక్సైజ్ ట్యాక్స్ రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా లోపల ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. కాకపోతే గీత కులాలకు కేటాయించే బార్‌కు మాత్రం 50 శాతం మాత్ర మే లైసెన్స్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. సోమవారం రాయచోటిలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎక్సైజ్ ఈఎస్ మధుసూదన్ కలిసి నూతన బార్ పాలసీ విధానంపై జిల్లా బార్ల కేటాయింపునకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

హంద్రీ-నీవా కాలువపై వంతెన నిర్మించండి

● నల్లగుట్టపల్లె వాసుల డిమాండ్



హంద్రీ-నీవా కాలువ వద్ద నిరసన తెలుపుతున్న నల్లగుట్టపల్లె వాసులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువపై వంతెన నిర్మించాలని నల్లగుట్టపల్లె గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆదివారం హంద్రీ-నీవా కాలువ వద్ద గ్రామస్థులు నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి, వ్యవసాయ పొలాలకు మధ్య హంద్రీ-నీవా కాలువ ఉందని, ప్రస్తుతం కాలువ నిర్మాణాలు పూర్తి చేసి నీళ్ల విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారని, దీంతో తమ పొలాలకు వెళ్లడానికి దారి ఉండదని, పొలాల్లోకి వెళ్లడానికి కాలువపై వంతెన ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో అధికారులు వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చి పట్టించుకోలేదని, దీంతో కాలువలో మట్టిని తోలుకుని ప్రస్తుతం పొలాల్లోకి వెళుతున్నట్లు తెలిపారు. మా కష్టాన్ని కలెక్టర్, మదనపల్లె సబ్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కాలువలో నీరు వదిలితే పశువులు, రైతుల రాకపోకలకు ఇబ్బంది తప్పదని, కాలువ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మహిళలు కాలువ దాటుతూ కిందపడి ప్రమాదాలకు గురయ్యారని గుర్తు చేశారు. అధికారులు వంతెన నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు.

రేపు కడప జిల్లా నేతలతో సీఎం చంద్రబాబు భేటీ

జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో విజయంపై అభినందనలు

కడప, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ విజయదుందుభి మోగించింది. ముఖ్యంగా పులివెందులలో జగన్ పార్టీకి డిపాజిట్ దక్కలేదు. రాష్ట్రంలోనే ఈ విజయం కూటమిలో నూతన ఉత్సాహం నింపింది. పులివెందులలో టీడీపీ జెండా ఎగురవేయడం ఎన్నో ఏళ్ల కల. అయితే నేడు అది నెరవేరింది. పులివెందుల, ఒంటిమిట్ట విజయానికి కూటమి నేతలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ గెలుపు టీడీపీకి మంచి కిక్‌నివ్వడంతో పాటు జిల్లా నేతలకు మైలేజ్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో కడప జిల్లా నేతలకు సీఎం చంద్రబాబు నుంచి పిలుపువచ్చింది. పులివెందుల ఎన్నికల్లో కీరోల్‌గా ఉన్న బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి కూడా ప్రత్యేక ఆహ్వానం అందింది. పులివెందుల, ఒంటిమిట్ట గెలుపులో కీలకపాత్ర పోషించిన కడప, అన్నమయ్య జిల్లాల టీడీపీ నేతలతో మంగళవారం సాయంత్రం చంద్రబాబు భేటీ కానున్నారు. ఈ ఉప ఎన్నికతో వదిలేయకుండా టీడీపీని పులివెందులలో మరింత పటిష్టం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 7 సీట్లు కట్టబెట్టారు. ఉప ఎన్నికల్లో కూడా రెండు స్థానాల్లో టీడీపీని గెలిపించారు. ఈ నేపథ్యంలో జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించేందుకు జిల్లా నేతలతో కలిసి సీఎం చంద్రబాబును కలుస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఇటీవల ఏబీఎన్ ఆంధ్రజ్యోతి డిబేట్‌లో వెల్లడించారు. కాగా మంగళవారం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో సీఎంను కలవడంలో తమకు ఇంకా స్పష్టత రాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

8400 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

● స్త్రీశక్తి వల్ల ఆర్టీసీకి నష్టం లేదు
● ఆర్టీసీ ఈడీ చెంగల్ రెడ్డి

పీలేరు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకంలో భాగంగా 8400 (75 శాతం) బస్సుల్లో మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణం చేయవచ్చునని ఆర్టీసీ ఈడీ టి.చెంగల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పీలేరు ఆర్టీసీ డిపోలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం వల్ల ఆర్టీసీకి ఎటువంటి నష్టం ఉండదని, సంస్థకు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తుందని చెప్పారు. బస్సుల కండీషన్ ఎప్పటి కప్పుడు పర్యవేక్షించడం కోసం రాష్ట్రవ్యాప్తంగా 129 డిపోలలో డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలు ప్రతి నెలా మొదటి వారంలో నిర్వహిస్తామన్నారు. స్త్రీశక్తి పథకం అమలు వల్ల బస్సులపై అదనపు ఒత్తిడి ఉంటుందని, ఇందుకోసం అదనంగా ప్రతి డిపోకు అవసరమైన గూడ్స్ (పరికరాలు) అదనంగా అందుబాటులోకి ఉంచుతామని తెలిపారు. ఇక మీదట ఆర్టీసీలో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే కొనుగోలు చేస్తారని, ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. పీలేరుకు గతంలో చేసుకున్న అంతర్ రాష్ట్ర సర్వీసుల ఒప్పందం మేరకు అదనంగా కొత్త బస్సులు వస్తాయని చెప్పారు. పీలేరు నుంచి బెంగళూరుకు సుమారు 12 అదనపు సర్వీసులు వస్తాయని తెలిపారు. పీలేరు డిపోకు చెందిన డ్రైవర్ వి.పరంధామనాయుడు, కండక్టర్ ఎన్. రేణుకను శాలువ, పూలమాలతో సన్మానించారు. పీలేరు ఆర్టీసీ డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఈడీ భరోసా ఇచ్చారు. పీలేరు డిపో తనకు మదర్ డిపో అని ఇందుకోసం తన వంతు బాధ్యతగా అవసరమైన వనరులు సమకూర్చుతానని తెలిపారు. డీఎం కార్యాలయం మరమ్మతులకు నిధులు మంజూరు చేశామని, రూ.45 లక్షలతో ప్రయాణికులకు మెరుగైన మరుగుదొడ్ల సౌకర్యం కోసం నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. వర్షం వస్తే డిపోలో నీరు నిలిచిపోతోందని ఈడీ దృష్టికి తేగా కడప ఈఈతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిపోకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు.

మహిళా ప్రయాణికులతో ముఖాముఖి...

పీలేరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళుతున్న మహిళా ప్రయాణికులతో ముచ్చటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతున్నారు, ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. మహిళా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్యారేజ్ సిబ్బందితో సమావేశమై బస్సుల కండీషన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈడీ వెంట డీఎం నిర్మల, పలువురు ఆర్టీసీ అధికారులు, కార్మిక సంఘ నేతలు, ఉద్యోగులు ఉన్నారు.



బస్సులో మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న ఈడీ చెంగల్‌రెడ్డి

కొందరికి ఖేదం... మరికొందరికి మోదం

● కుప్పకూలిన ధరలతో కుదేలైన రైతులు

7

ప్రయాణికులతో బస్టాండు కిటకిట

పీలేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల వరుస సెలవుల తరువాత తమ స్వగ్రామాల నుంచి కార్యక్షేత్రాలకు తిరిగి బయలుదేరిన ప్రయాణికులతో ఆదివారం సాయంత్రం పీలేరు ఆర్టీసీ బస్టాండు కిటకిటలాడింది. స్వాతంత్ర దినోత్సవం, శ్రీ కృష్ణాష్టమి, ఆదివారం వరుసగా సెలవులు రావడంతో తిరుపతి, బెంగళూరు, హైదరాబాదు, చెన్నై వంటి దూర ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు తమ స్వస్థలాలకు వచ్చారు. మూడు రోజుల అనంతరం తిరిగి వెళ్లేందుకు సమాయత్తమవడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తిరుపతి, మదనపల్లె మార్గాల్లోని బస్సులు ప్రయాణీకులతో కిటకిటలాడాయి. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా తిరుపతి మార్గంలో అదనపు సర్వీసులు నడిపినట్లు డీఎం నిర్మల తెలిపారు.




బస్సుల వద్ద ప్రయాణికుల రద్దీ



బస్సుల కోసం బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు

గండికోట ప్రాజెక్టులో 20.38 టీఎంసీల నీటిమట్టం


గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. 20.38 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోటప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 10,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటిని విడుదల చేస్తున్నామన్నారు. కాగా ఆదివారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 12,900 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 11,000 క్యూసెక్కులు ఉందన్నారు. కాగా పైడిపాలెం రిజర్వాయిర్‌కు 500 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

కొందరికి ఖేదం... మరికొందరికి మోదం

- కుప్పకూలిన ధరలతో కుదేలైన బొప్పాయి, మామిడి రైతులు
- రికార్డు స్థాయిలో ధరలతో లాభాల బాటలో అరటి రైతులు
- 4 నెలలుగా కిలో రూ.17 అరటి ధరలు
- 15 రోజుల్లోనే కిలో రూ.16 నుంచి రూ.8కి పడిపోయిన బొప్పాయి ధరలు


కోడూరులో బొప్పాయి పంటను తొలగిస్తున్న రైతులు (ఫైల్)


మామిడి చెట్లను కొట్టేసి వంటచెరకుగాఎగుమతి చేస్తున్న రైతులు

రాజంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతోంది. ప్రభుత్వం ఉచిత కరెంటు, అనేక సబ్సిడీలు, పంట రుణాలు, సబ్సిడీ పనిముట్లు, బ్యాంకు రుణాలు ఎన్ని అందించినా... అన్నదాతలు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో కుదేలవుతున్నారు. పండ్లతోటలకు పెట్టింది పేరైన రాజంపేట డివిజన్‌లో లక్ష ఎకరాల్లో పండ్లతోటలు సాగు చేస్తున్నారు. మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మ పంటలను విరివిగా సాగు చేస్తూ వాటిపైనే జీవనం సాగిస్తుంటారు. ప్రస్తుతం గతనెల చివరి నుంచి బొప్పాయ పంట దిగుబడి ప్రారంభమైంది. దిగుబడి ప్రారంభంలో కిలో బొప్పాయి ధర ఏకంగా రూ.16 పలికింది. భారీస్థాయిలో డిమాం డ్ ఉండడంతో రైతులు ఆనందపడ్డారు. ఇంతలో ఏమైందో ఏమోకాని దిగుబడి మొదలై కాయలు ఒక్కసారిగా కోతలు కోయడంతో డిమాండ్ తగ్గింది. కిలో రూ.16 నుంచి రూ.8కి పడిపోయింది. ధరల పతనంపై రైతులు ఆందోళన చేసినా.. ఏకంగా బొప్పాయి వ్యాపారులు, దళారులు రైతులతో కలెక్టర్ మాట్లాడినా ప్రయోజనం లేకుం డా పోయింది. కిలో రూ.8కి కొనే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఈ సమయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో రాజంపేట సబ్‌కలెక్టర్ స్పందించి ధరలు తగ్గిస్తే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ, ఉద్యానవన అధికారుల పర్యవేక్షణలో సమావేశాలు నిర్వహించి రైతులకు భరోసా ఇచ్చా రు. ఏకంగా ధరలు తగ్గిస్తే వెంటనే చర్యలు చేపడతామం టూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. అయినా బొప్పాయ పంటను కిలో రూ.8కు కొనడంలో కూడా వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. కారణం పంటదిగుబడి ఒకేసారి రావడంతో దిగుబడికి తగ్గట్టు డిమాండ్ లేకపోవడంతో ధరలు పతనమయ్యాయి.

బొప్పాయ పంటను అర్ధాంతరంగా తీసివేసి...

రాజంపేట డివజన్‌లో 30వేల ఎకరాల్లో బొప్పాయ పంట పండుతోంది. ఈ స్థితిలో భారీఎత్తున ధర పడిపోవడంతో ఏకంగా వంద కోట్ల రూపాయల ఆదాయాన్ని రైతులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. చేసేది లేక కొందరు రైతులు బొప్పాయి పంటను అర్ధాంతరంగా తీసివేసి ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే స్థితిలో గత నాలుగు నెలలుగా సాగిన మామిడి పంట వ్యాపారం కోడూరు నుంచే రూ.200 కోట్ల వరకు జరగాల్సి ఉండగా డిమాండ్ లేక... కాయలను రోడ్లపై పారవేసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కిలోకు రూ.4 సబ్సిడీ ఇచ్చినా కోసిన కాయలకు కూలీ ఖర్చులు కూడా లేకపోవడంతో రూ.200 కోట్ల వ్యాపారం 50 కోట్లకు పడిపోయింది. 25 వేల ఎకరాల్లో సాగయ్యే మామిడి పంట ఎందుకు కొరగాకుండాపోయింది. దీంతో మామిడి రైతులు ఏమి చేయలేక చెట్లను తొలగించి.. ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపుతున్నారు.

అరటి రైతులకు అధిక లాభాలు

ఈ ఏడాది అరటి రైతుల పంట పండింది. గత నాలుగు నెలలుగా రికార్డు స్థాయిలో ధరలు పలుకుతున్నాయి. రాజంపేట డివిజన్ ప్రాంతంలో దాదాపు 30 వేల ఎకరాల్లో అరటి సాగవుతోంది. నాలుగు నెలల నుంచి కిలో రూ.17 ధర నిలకడగా సాగుతోంది. గత ఐదేళ్ల కిందట ఇదే పరిస్థితి ఉండేది. ఇప్పుడు కూడా కిలో ధర రూ.17 నాలుగు నెలలుగా ఉండడంతో గెలకు కనీసం రూ.500 రూపాయలు ఆదాయం వస్తోంది. ఒక ఎకరాకు వెయ్యి చెట్లకు 4 లక్షల నుంచి 5 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను రూ.2లక్షల నుంచి 3లక్షల ఆదాయం వస్తోంది. దీంతో అరటి రైతులు ఆనందంలో ఉన్నారు. ఇక ఈ యేడా ది వేసవికాలంలో ఈదురుగాలులు లేకపోవడంతో అరటి రైతులకు బాగా కలిసి వస్తోంది.


రాజంపేట ప్రాంతంలో పెద్దత్తున సాగైన అరటి

బతుకుదెరువు కోసం వెళ్లి... సౌదీలో కుమారకాల్వ వాసి మృతి


నూర్ బాష (ఫైల్)

చక్రాయపేట,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషించు కునేందుకు కువైట్‌కు వెళ్లిన మండలంలోని కుమారకాల్వ గ్రామానికి చెందినషేక్ నూర్ బాష (38) మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకెళితే... చక్రాయపేట మండలంలోని కుమారకాల్వ గ్రామానికి చెందిన నూర్‌బాష బతుకు దెరువుకోసం 15 సంవత్సరాలుగా గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాకు వెళ్లి... ఒక కంపెనీలో కార్మి కుడిగా పనిచేస్తున్నాడు. సెలవుపై ఇండియాకు వచ్చి దాదాపు ఐదు నెలల క్రితం మళ్లీ సౌదీకి వెళ్లిపోయాడు. ఆదివారం 9 గంట లకు (ఇండియా కాలమానం ప్రకారం 12.30) నూర్ బాష డ్యూటీ కోసం సిద్ధమయ్యేందుకు తన గదిలో ఉన్న బాత్రూంలోకి కాలకృ త్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కిందపడిపోయి మృతి చెందాడు. ఈ విషయం అక్కడ ఉన్న తోటి స్నేహితులు తెలిపారన్నారు. నూర్ బాష మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వదేశానికి త్వరగా తెప్పించేం దుకు రాష్ట్రప్రభుత్వం సాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైదుకూరు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు నుంచి వనిపెంటకు వెళ్లే రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులో మోటర్‌సైకిల్ అదుపు తప్పి కింద పడటంతో గుగ్గిళ్ల జగదీష్ (18) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు... శనివా రం రాత్రి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మకాలనీకి చెందిన జగదీష్ పనిమీద గంజికుంటకు వెళ్లి తిరిగి వస్తుండగా మోటర్‌సైకిల్ అదుపు తప్పి కల్వర్ట్‌లో పడ్డాడు. దీంతో తీవ్రగాయాలై అక్కిడకక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జ్వరంతో విద్యార్థి మృతి


బింగి రఘువరన్

వేంపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె శ్రీరామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బింగి రఘువరన్ (8) అనే విద్యార్థి తీవ్ర జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బింగి ఓబులేసు, భారతిలు స్థానిక శ్రీరామ్ నగర్‌లో నివాసముంటూ కూలిపనులు చేసుకునేవారు. వీరి ఒక్క గానొక్క కుమారుడు రఘువరన్ సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతు న్నాడు. కాగా, ఇంటి చుట్టుపక్కల చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుధ్యం అధ్వాన్నంగా తయారై దుర్గంధం వెద జల్లుతోంది. దీంతో వారం క్రితం రఘువరన్‌కు జ్వరం రాగా ఆసు పత్రిలో చికిత్స చేర్పించగా.. ఆదివారం ఉన్నట్లుండి మృతి చెందాడని బంధువులు చెబుతు న్నారు. అపరిశుభ్రత వల్ల ఈగలు, దోమ లు ఎక్కువై జ్వరం వచ్చి మృతిచెందాడని బంధువులు వాపోయారు.

కారు, స్కూటర్ ఢీ - ఒకరికి గాయాలు

ఖాజీపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప, కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లె చెరువు వద్ద కారు స్కూటర్‌ను ఢీకొన్న సంఘటనలో మొయిళ్ల కాల్వ దివాకర్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే... పాటిమీదపల్లె గ్రామానికి చెందిన దివాకర్ ఆదివారం పెట్రోలు కోసం వెళ్లి తీసుకుని వస్తుండగా.. మైదుకూరు నుంచి కడప వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో దివాకర్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

- 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం పిలుపు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో 7ను అమలు చేసి డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాతపింఛన్ వర్తింపచేయాలనే డిమాండ్‌తో ఆగస్టు 25వ తేదీ సోమవారం వియవాడ ధర్నా చౌక్ వద్దచేపట్టే మహాధర్నా కార్యక్రమానికి కడప జిలల్లాలోని డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు ఉద్యోగులు పాల్గొని వియవంతం చేయాలని జిల్లా డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం పిలుపునిచ్చింది. ఆదివారం కడపనగరం ఎన్జీఓ భవన్‌లో మహాధర్నా పోస్టర్‌ను డీఎస్సీ-2003 టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ గుజ్జల తిరుపాల్ ఆధ్వర్యంలో ఏపీఎన్‌జీఓ జిలల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.శ్రీనివాసులు, డి.రవికుమార్, పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాష, ఏపీటీఎఫ్-1938 జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యూటీఎఫ్ జిలల్లా కోశాధికారి కె.నరసింహారావు, వైఎస్‌ఆర్‌టీఏ రాష్ట్ర నాయకులు సజ్జల రమణారెడ్డి, ఏపీటీఎఫ్ 257 జిల్లా నాయకులు రామచంద్రారెడ్డి, ఆపస్ జిల్లా ఉపాధ్యాయులు శ్రీనివాసులు మరియు డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్లు ఉదయభాస్కర్, కె.వీరప్రతాప్, శోభారాణి ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు అంటే సెప్టెంబర్ 1, 2004 ముందే ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తయి ప్రభుత్వ పాలనాపరమైన విధానాల వలన పోస్టింగ్ ఆలస్యమైన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పింఛన్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కడప జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరు పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

పలు ఘటనల్లో కేసు నమోదు

పీలేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని చెన్నారెడ్డి కాలనీకి చెందిన ఓ వృద్ధురాలిపై దౌర్జన్యం చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరుకు చెందిన అన్వేష్, శ్రావణ్, సాబీర్, శ్యామ్, మహేంద్ర అనే వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. అదే విధంగా ఆగస్టు 15వ తేదీ సాయంత్రం స్థానిక కడప మార్గంలో ట్రాఫిక్ అంతరాయం కలిగించడమే కాకుండా స్థానికులకు ఇబ్బందులు కలిగించిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. విగ్రహ మంటపం వద్ద లోగోల ఆవిష్కరణ పేరుతో గ్యాస్ సిలిండర్‌తో పేపర్, పూలు రోడ్డుపై వెదజల్లుతూ ప్రజలకు కలిగిస్తుండడంతో ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఒక గ్యాస్ సిలిండర్‌తోపాటు ఒక పూలు వెదజల్లే మెషీన్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద కేసు దర్యాప్తు ముమ్మరం

- మృతుడి వివరాలు గుర్తింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని సీటీఎం గ్రామం రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని మృతదేహం వివరాలు వెలుగులోకి వచ్చాయని తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు పశ్చిమబెంగాల్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఖదీర్‌గా గుర్తించామన్నారు. పనులకోసం మదనపల్లె ఏరియాకు వలస వచ్చాడని, ఒంటిపై గాయాలు ఉండడంతో హత్య చేశారనే కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. రైల్వే బ్రిడ్జికు సమీపంలో మృతదేహం పడి ఉండడంతో ఎవరైనా రైల్ నుంచి తోశారా, లేక ప్రమాదవశాత్తు పడ్డారేమో అనే కోణంలో కదిరి రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. పూర్తి వివరాల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మహిళ ఆత్మహత్య కేసులో ఇద్దరు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో అక్కాయపల్లె శాస్త్రినగర్‌లో నివాసముంటున్న సుభాన్‌బీ తనను భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనలో మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆమె భర్త బోధన చిన్న, మామ చిన్న సిద్దయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి.. రిమాండుకు తరలించినట్లు కడప తాలుకా సీఐ రెడ్డెప్ప తెలిపారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ

బి.కొత్తకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని పాశం వీధిలో వెలసిన సత్యసాయి బాబా మంది రంలో ఆదివారం నూతనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ ఏ ర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్య క్షుడు వరప్రసాద్, కన్వీనర్ శేఖర్‌బాబు, సేవాదళ్ కోఆర్డినేటర్ శ్రీపాణి పాల్గొన్నారు.

ఈశ్వరీదేవిమాత ఆలయ నిర్మాణానికి విరాళం


ఈశ్వరీదేవి అమ్మవారి పటం అందుకుంటున్న దాతలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి మాత ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలు విరాళంగా దాతలు అందజేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేట వాసి కె.శ్రీనివాసులు ఆచారి కుటుంబ సభ్యులు మఠాధిపతి వీర శివకుమారస్వామికి చెక్కు అందించినట్లు కార్యనిర్వహణాధికారి బీవీ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

డాక్టర్ వైబీ రెడ్డి మృతి.. నేడు అంత్యక్రియలు


డాక్టర్ వైబీరెడ్డి

కడప, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీ వాసి డాక్టర్ వైబీ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం 12.00 గంటలకు బెంగుళూరులో మృతి చెందారు. వైబీ రెడ్డి కడప 7 రోడ్స్‌లో దాదాపు 15 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో ప్రజలకు సేవలందించారు. అనంతరం గ్రానైట్ మైన్ ఓనర్‌గా పేరు ప్రఖ్యాతులు గడించారు. ఈయనకు ఫాదర్ ఆఫ్ కడప మార్బుల్స్ అని బిరుదు కూడా ఉంది. ఈయన స్వగ్రామం సిద్దవటం మండలం భాకరాపేట. భార్య, ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్ళు ఉన్నారు. పెద్ద కుమార్తె కుటుంబం ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. చిన్న కుమార్తె కుటుంబం బెంగుళూరులో వ్యాపార రీత్యా ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు కడప హౌసింగ్ బోర్డు కాలనీలో వైబీ రెడ్డి స్వగృహం నుంచి అంతిమయాత్ర బయలుదేరి రామకృష్ణ హైస్కూల్ సమీపంలో గల హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


డాక్టర్ వైబీ రెడ్డికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంట్రాక్టర్ సింగారెడ్డి సుబ్బారెడ్డి

హామీ అమలయ్యేదెప్పుడో...!

- నీలాపురం వంకతో రాకపోకలకు ఇబ్బంది
- సుగాలితాండా ప్రజలకు ఇక్కట్లు


వంక ప్రవాహంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

దువ్వూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురం-సుగాలి తాండా మధ్యలో ప్రవహిస్తున్న వంకతో ఈ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వర్షాకాలంలో వంక నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. వంకకు పై తట్టు భాగంలో 600 ఎకరాలకు మేర రైతుల పొలాలు ఉన్నాయి. వంక మీదుగా తెలుగుగంగ జలాలు ప్రవహించి దువ్వూరు చెరువులోకి నీరు చేరుతుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులు నిమిత్తం బండ్లు, ట్రాక్టర్లు, కూలీల ఆటోలు అటు వైపు వెళ్లాలంటే రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను 15 ఏళ్లుగా ఎదుర్కొంటున్నా ఎవరికీ పట్టడంలేదు. రాకపోకలు సజావుగా సాగేందుకు వంక మీదుగా పైపులు వేసి నీటి ప్రవాహం వెళ్లే ఏర్పాట్లను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇది కొంతవరకు ప్రజలకు, రైతులకు ఉపశమనం కలిగించినా శాశ్వత పరిష్కారం లభించలేదు.

నాయకుల హామీలు నీటి మూటలేనా...

ప్రభుత్వాలు ఏవైనా నాయకుల హామీలు నీటి మూటలుగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా డీఎల్ రవీంద్రారెడ్డి ఉన్న సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో కలెక్టర్ కృష్ణబాబు కూడా ఈ సమస్యను పరిశీలించారు. తదనంతరం వైసీపీ ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డి రెండు దఫాలు కొనసాగిన సమయంలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. వంక మీదుగా చిన్నపాటి బ్రిడ్జి నిర్మించాలనే ఉద్దేశ్యం అమలు కాలేదు. దీంతో ప్రజల ఇబ్బందికి పరిష్కారం లభించలేదు. ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ ఎన్నికయ్యాక ప్రజలు, నాయకులు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి అతీగతి కనిపించడంలేదు. వంక ఉధృతి కొనసాగిన సమయంలో నాయకులు పరిశీలించడం, మాటలతో మమ అనిపించడం తప్ప సమస్య పరిష్కారం వైపు దృష్టి సారించడం లేదని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం దిశగా బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వేధిస్తున్న వాహనాల రద్దీ

● ఆగిన రోడ్డు విస్తరణ పనులు ● రోడ్డు పక్క స్థలాల ఆక్రమణతో పాదచారుల ఇబ్బందులు ● బైపాస్ రోడ్డు ఏర్పాటుకు డిమాండ్

రైల్వేకోడూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బైపాస్ రోడ్డు లేకపోవడం, రోడ్డు పక్క స్థలాల ఆక్రమణలు, వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్లు విశాలంగా లేకపోవడం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైల్వేకోడూరు పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
పండ్ల తోటలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం కావడంతో రైల్వే కోడూరు పట్టణానికి దేశ వ్యాప్తంగా ఉన్న పలు ప్రాంతాల నుంచి ప్రతి రోజూ పెద్ద ఎత్తున వాహనాలు వస్తుంటాయి. తిరుమలకు వెళ్లే మార్గంలో ఉండడంతో పట్టణం మీదుగా వందలాది వాహనాలు వెళుతుంటాయి. సమీపంలోనే చెన్నై పోర్టు కూడా ఉండడంతో పెద్ద, పెద్ద యంత్రాలు, కంటైనర్ వాహనాలు కూడా వెళుతుంటాయి. దీంతో పట్టణంలోని ప్రధానదారి, చిట్వేలి రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, మూడు రోడ్ల కూడళ్లు, అప్రోచ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది.



అటవీశాఖ అతిథి గృహం సమీపంలో నిలిచిన వాహనాలు

ఈ రద్దీని తట్టుకునేందుకు వీలుగా ప్రధాన రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేయాలని తలచిన ప్రభుత్వం అందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేసింది. దీంతో అప్పట్లో కొంత వరకు ఏర్పాట్లు చేశారు. అంతలోనే ప్రభుత్వం మారడంతో ఆ రోడ్డును ఆరు వరుసలుగా అభివృద్ధి చేయాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఇంకా పనులు ప్రారంభించ లేదు. ఈ నేపథ్యంలో పట్టణంలోని మూడు కూడళ్లలో రద్దీ పెరిగిపోయింది. ఈ రోడ్లపై చిన్న కార్యక్రమం చేసినా ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీనికి తోడు ప్రధానదారితో పాటు చిట్వేలి రూటు, రైల్వేస్టేషన్ రూటు తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్క స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. వ్యాపారులు డ్రైనేజీని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ఆ ప్రాంతాల్లో పాదచారులు నడవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. దీనిపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ప్రతి రోజూ ఏదో ఒక రూపంలో రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. బైపాస్ రోడ్డు నిర్మించి, ట్రాఫిక్‌ను మళ్లిస్తే, పట్టణంలో వాహనాల రద్దీ తగ్గిపోతుందని ప్రజలు అంటున్నారు. ఇక మార్కెట్ వీధి, మూడు రోడ్ల కూడళ్లు, రైల్వేస్టేషన్ రూటు, చిట్వేలి



చిట్వేలి మార్గంలో అడ్డదిడ్డంగా నిలిపిన లారీలు

రూటు, మార్కెట్ వీధి, ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతి నిధులు చర్యలు తీసుకుని ఆరు వరసల రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌తో నరకం



ట్రాఫిక్ రద్దీతో నరకం అనుభవిస్తున్నాం. పిల్లలను పాఠశాలకు తీసుకు వెళ్లేందుకు తల్లిదండ్రులు ఇక్కట్లు పడుతున్నారు. చిట్వేలి రూటులోని బ్రిడ్జి వద్ద బొప్పాయి లారీలు అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

- మణి, టైలర్, గుండాలపల్లె

రోడ్డు ప్రమాదాలకు కారణం



మూడు రోడ్ల కూడలి, చిట్వేలి రూటు, రైల్వేస్టేషన్ రోడ్డు, అప్రోచ్ రోడ్డుపై వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. మోటారు సైకిల్‌లో ప్రధానదారిపై వెళ్లేందుకు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలి.

-యెలిశెట్టి గుండాలు, స్థానికుడు

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి

ట్రాఫిక్ సమస్య ఎక్కడ ఉన్నా వెంటనే సిబ్బందిని పంపి పరిష్కరిస్తున్నాం. మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సమస్య ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు, వాహనదారులు కూడా పోలీసులకు సహకరించాలి. బైపాస్ రోడ్డు వస్తే చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుంది.

-ఎల్‌వీ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ, రైల్వేకోడూరు

తాగునీటి బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసనాపురం గ్రామం పెడబల్లివాండ్లపల్లెలో ఆదివారం నిర్వహించిన సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ బోరును ప్రారంభించా రు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. దళితవాడలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సహదేవరెడ్డి, హరినాథ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నాగసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నామినేటెడ్ పదవుల్లో ఎరుకలకు అన్యాయం'

రాయచోటిటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో ఎరుకల కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆల్ ఇండియా ఎరకుల హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి అమావాస్య రమణయ్య, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి అమావాస్య రెడ్డెయ్య అన్నారు. ఆదివారం వారు రాయచోటి పట్టణంలోని వైహెచ్‌పీఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నందమూరి తారక రామారావు హయాం నుంచి తెలుగుదేశం పార్టీ వెన్నంటి నడుస్తున్న ఎరుకల కులస్తులను కార్పొరేషన్ పదవుల్లో విస్మరించడం బాధాకరమన్నారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడి ఉన్న ఎరుకుల కులస్తుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి రాయచోటి నియోజకవర్గ అధ్యక్షుడు పోలా నిత్యపూజయ్య, వైహెచ్‌పీఎస్ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కంపా రమణయ్య, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాసరి భారతమ్మ, శంకరయ్య, గోవిందు, మోహన తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హిందీ ప్రచారసభ హైదరాబాదు వారు నిర్వహించే ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారద్, భూషణ్, విద్వాన్ పరీక్షలకు ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చున న్నారు. ఈ పరీక్షలు వచ్చేనెల 13, 14 తేదీల్లో జరుగుతాయన్నారు. ఈ పరీ క్షలు ఉత్తీర్ణులైన విద్యార్థులు హిందీ పండిట్ ట్రైనింగ్ చేయడానికి, డీఎస్సీ రాయడానికి అర్హులవుతారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 6303701314 నంబరులో సంప్రదించాలన్నారు.

సంచార జాతులకు అండదండగా బీజేపీ

రాయచోటి కలెక్టరేట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సంచార జాతుల వారి సంక్షేమానికి బీజేపీ అండగా నిలుస్తుందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. ఆగస్టు 30న ఈ కార్యక్రమం విజయవంతం కోసం అన్నమయ్య జిల్లా రాయచోటి కార్యాలయంలో ఆయన పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఓబీసీ జిల్లా అధ్యక్షులు రేపన శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్ర కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు బండి ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు మట్టం కిరణ్‌కుమార్, పూల నాగరాజా, ఓబీసీ రాష్ట్ర నాయకుడు కురుముట్ల వెంకటేశ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిల్ల స్వామినాయక్, స్టేట్ కౌన్సిలర్ నెంబర్ బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టం వృథా కానివ్వను : కస్తూరి

పెనగలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి విజయం కోసం అవిశ్రాంతంగా పోరాడిన కార్యకర్తల కష్టం వృథా కానివ్వనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు భరోసా ఇచ్చారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో టీడీపీ కార్యకర్తలు కొంత నిరుత్సాహానికి గురయ్యారన్న సంగతి తనకు తెలుసన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడిన ఏ కార్యకర్త నిరుత్సాహానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం వారానికి మూడు రోజుల పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం స్థానిక అధికారులతో సంప్రదిస్తానన్నారు. ఇక్కడ కాకుంటే జిల్లాస్థాయి అధికారులతో మాట్లాడుతామన్నారు. అక్కడ కూడ పరిష్కారం కాకపోతే రాష్ట్ర స్థాయిలో కూడా పోరాడుతామన్నారు. మరీ కాకపోతే నేరుగా ముఖ్యమంత్రితోనే మాట్లాడి అది ఎంతటి సమస్య అయినా పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. ఈ సమావేశంలో



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

సీనియర్ నాయకులు పెరుగు కృష్ణయ్య, ఎన్.యానాదయ్య, మల్లయ్య, నారాయణరెడ్డి, సురేష్‌బాబునాయుడు, రమణయ్య, రాంప్రసాద్ నాయుడు, షామీర్, నాగేశ్వరరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

పెనగలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) :వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న మండపాల ఏర్పాటులో విద్యుత్‌శాఖ నిబంధనలు తప్పక పాటించాలని ఏఈ ఆర్.ఓబుల్ రెడ్డి సూచించారు. మండపాలు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దగ్గరగా ఏర్పాటు చేయరాదన్నారు. తప్పనిసరిగా అలాంటి ప్రాంతంలోనే మండపం ఏర్పాటు చేయాల్సి వస్తే విద్యుత్ సిబ్బందిని ముందుగా సంప్రదించాలన్నారు. మండపానికి ఎన్ని రోజులకు ఎంత కరెంట్ కావాలో తెలిపితే, తగిన మీటర్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. ఇప్పటి నుంచే విద్యుత్ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ రాజగోపాల్‌రెడ్డి

సుండుపల్లె, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏపీఎస్‌జీఆర్‌ఈఏ మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ సంఘం కృషి చేస్తుందని తెలియజేశారు. విశ్రాంత ఉద్యోగులను చిన్నచూపు చూస్తూ వారి సమస్యలను 2018 సంవత్సరం నుంచి ప్రభుత్వాలు పక్కన పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా మునిరత్నంరాజు, గౌరవాధ్యక్షుడుగా సుబ్బరామరాజు, రామకృష్ణారెడ్డి, కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా సురేంద్ర



నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

నాథరెడ్డితో కలిపి 14 మందితో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకరయ్య, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా పంతగాని పుట్టిన రోజు వేడుకలు

రైల్వేకోడూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం రైల్వేకోడూరులో కూటమి నా యకులు, కార్యకర్తలు పేదలకు అన్నదానం చేశారు. ఆలయాల్లో పూజలు చేశారు. ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయం



పంతగానికి కేక్ తినిపిస్తున్న కేకే చౌదరి

నుంచి సూర్యానగర్‌లో ఉన్న పంతగాని నివాసానికి ర్యాలీ నిర్వహించారు. ఆయనకు భారీ గజమాల వేసి సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరి శ్రమల చైర్మన్ కేకే చౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు లారీ సుబ్బరాయుడు, యువ నాయకులు కస్తూరి దినేష్, ఐదు మండలాలకు చెందిన కూటమి శ్రేణులు పాల్గొన్నారు.
ఓబులవారిపల్లె: గాదెల గ్రామ పంచాయతీకి చెందిన దళిత నాయకులు పోలంరెడ్డి మల్లికార్జున, చిన్న, శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

వర్షాలతో కోతకు గురైన రోడ్డు



కోతకు గురైన రోడ్డు

సుండుపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డబుల్ రోడ్డు అర్ధాంతరంగా ఆగిపోవడంతో సుండుపల్లె నుండి రాయచోటికి పోవాలన్నా, రావాలన్నా భయం భయంగా ప్రయాణం చేయాల్సి వస్తోందని జనసేన సీనియర్ నాయకులు రామశ్రీనివాసులు ఆదివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అనుంపల్లి నుంచి సుండుపల్లె సబ్ స్టేషన్ వరకు రోడ్డు అర్ధాంతరంగా ఆగిపోయిందని, ఆ రోడ్డును పూర్తి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలుమార్లు వినతిపత్రం అందజేశామన్నారు. రెండు వారాల నుంచి విపరీతమైన వర్షాలు కురుస్తుండడంతో రోడ్డు సుమారు 8 చోట్ల కోతకు గురైందన్నారు. ఈ రహదారుల్లో రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

● జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చంద్రయ్య

రాజంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మహానగరంలో ఈనెల 23న జరిగే భారత కమ్యూనిస్టుపార్టీ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గాలి చంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు ప్రత్యేక చట్టాలు అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేముల నరసింహ, గుగ్గిళ్ల శ్రీనివాసులు, రాముడు, జమాల్‌బాషా, పి.సుబ్రమణ్యం, కాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్తు మారెమ్మ జాతర

నందలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ముత్తుమారెమ్మ జాతర సందర్భంగా ఆదివారం నాగి రెడ్డిపల్లెలో మహిళలు పెద్ద ఎత్తున అంబళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, నాగిరెడ్డి పల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ ముత్తుమారెమ్మను దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. బీజేపీ నాయకులు మురళీ, జయచంద్రారెడ్డి, జాతర నిర్వాహకులు భాస్కర్, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సిద్దవటం బ్రిడ్జిపై సెల్ఫీల మోత

సిద్దవటం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి సమీపంలోని పెన్నా నది పోటెత్తడంతో చూసేందుకు ఆదివారం సాయంత్రం పెద్ద ఎత్తున పట్టణవాసులు తరలి వచ్చారు. దీంతో బ్రిడ్జి వద్దకు ఎవరూ వెళ్లరాదని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. అవేవీ పట్టించు కోకుండా ప్రజలు బ్రిడ్జిపై సెల్ఫీలు దిగడంపై పలువురు విమర్శిస్తున్నారు.



వంతెనపై సెల్ఫీలు తీసుకుంటున్న ప్రజలు

నేడు పెంచలకోనకు 'మోదుగుల' పాదయాత్ర

రాజంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య 18వ తేదీ సోమవారం ఉదయం పెంచలకోనకు పాదయాత చేయనున్నట్లు శ్రీ అన్నమాచార్య విద్యా సంస్థల కరస్పాండెంట్ మోదుగుల కళావతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట మండలం అన్నమయ్య 108 అడుగుల విగ్రహం సమీపంలోని అన్నమాచార్య విద్యా సంస్థల నుంచి సోమవారం ఉదయం 6 గంటలకు యాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. పాదయాత్రలో పాల్గొనేవారు ఉదయం 6 గంటలకు అన్నమాచార్య విద్యా సంస్థల వద్దకు చేరుకోవాలన్నారు. రెండు రోజుల పాటు ఈ పాదయాత్ర సాగుతుందన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఏపీడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక జర్నలిస్టులు ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇర్ఫాన్ మాట్లాడుతూ యూ నియన్ 69 ఏళ్లుగా జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్న లిస్టులు సుగవాసి రాజశేఖర్, పండ్రా ప్రసాద్, ముద్దలూరు శ్రీనివాసరాజు, పులి వెంకటేష్, సునీల్, భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జర్నలిస్టులు

సుండుపల్లె: మండల కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి పల్లం చందు, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయక్, ఉపాధ్యక్షుడు యూసుఫ్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో వర్షం

రైల్వేకోడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో వీధి రోడ్లు జలమయం అయ్యాయి. పాదచారులు పలు ఇక్కట్లు పడ్డారు. రైల్వేస్టేషన్ రోడ్డు, కొత్తబజారు, వసంతనగర్, ఉంగరాలనగర్ తదితర వీధుల్లో వర్షపు నీరు ప్రవహించింది. .



రైల్వేస్టేషన్ మార్గంలో ప్రవహిస్తున్న వర్షపునీరు

ఘనంగా గంగమ్మ గ్రామోత్సవం



గంగమ్మ ఊరేగింపులో సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గాలివీడు రోడ్డులో మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు ఆధ్వర్యంలో నిర్మించిన గంగమ్మ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనుండడంతో ఆదివారం గంగమ్మ అమ్మవారి విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుదరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని గాలివీడు రోడ్డు, కొత్తపేట, రామాపురం, మంగళ కాలనీ, లక్ష్మీపురం మీదుగా ఆలయానికి చేరుకుంది.

జీవో నెం 137 రద్దుకు డిమాండ్

రాజంపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ సంస్థకు సంబంధించిన భూములను ప్రభుత్వం లులూ షాపింగ్‌మాల్‌కు కేటాయిస్తూ ఇచ్చిన జీవో నంబరు 137ను రద్దు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రాజంపేట ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబొడ్డున ఏపీఎస్ ఆర్టీసీ గవర్నర్‌పేట - 1, 2 డిపో పాత బస్టాండుకు సంబంధించిన సుమారు 400 కోట్ల విలువ చేసే 4.15 ఎకరాల స్థలం రాష్ట్ర ప్రభుత్వం షాపింగ్‌మాల్‌కు కట్టబెట్టడం సరికాదన్నారు. కొన్ని దశాబ్దాలుగా ప్రజలకు రవాణా సౌకర్యాలు అందిస్తూ అందుబాటులో ఉన్న రెండు డిపోల్లోని 200 బస్సులను 1100 మంది కార్మికులను ప్రజలకు దూరం చేస్తూ బడా వ్యాపారులకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. లులూ షాపింగ్‌మాల్‌కు ఇస్తున్నట్లు ప్రభుత్వం జీవో 137ను వెంటనే రద్దు చేయాలని కోరారు. గవర్నర్‌పేట డిపోలకు సంబంధించిన పాతబస్టాండ్ స్థలాన్ని 1959లో అప్పటి ప్రభుత్వం గజం ధర రూ.16తో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. స్థలాన్ని ఇప్పటి ప్రభుత్వం ప్రైవేటు వ్యాపారులకు ధారాదత్తం చేసేందుకు తీసుకున్న నిర్ణయాలు వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆస్తులు, హక్కులు కాపాడుకునేందుకు ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాలు రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బీసీ శేఖర్, వర్కింగ్‌ప్రెసిడెంట్ కేవీ రమణ, ఎం.చలపతి, ఆర్వీబీ రాజు, జె.బాలాజీ, సీహెచ్ కృష్ణ, స్టాలిన్ ఎస్.వెంకటసుబ్బయ్య, ఎస్‌కే వల్లీ, కె.రహమతుల్లా, పి.బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవీ నరసయ్య

వాహనాల తనిఖీ

సిద్దవటం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులోని మూలపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ఒంటిమిట్ట సీఐ బాబు ఆదివానం వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్, వాహన పత్రాలు లేని ఒక్కో వాహనానికి రూ.185 చొప్పున 10 మంది ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనం నడిపినా, ముగ్గురు వ్యక్తులు వాహనంపై వెళ్లినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కొందరికి ఖేదం... మరికొందరికి మోదం

● కుప్పకూలిన ధరలతో కుదేలైన బొప్పాయి, మామిడి రైతులు ● రికార్డు స్థాయిలో ధరలతో లాభాల బాటలో అరటి రైతులు
● 4 నెలలుగా కిలో రూ.17 అరటి ధరలు ● 15 రోజుల్లోనే కిలో రూ.16 నుంచి రూ.8కి పడిపోయిన బొప్పాయి ధరలు



కోడూరులో బొప్పాయి పంటను తొలగిస్తున్న రైతులు (ఫైల్)



మామిడి చెట్లను కొట్టేసి వంటచెరకుగాఎగుమతి చేస్తున్న రైతులు

రాజంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతోంది. ప్రభుత్వం ఉచిత కరెంటు, అనేక సబ్సిడీలు, పంట రుణాలు, సబ్సిడీ పనిముట్లు, బ్యాంకు రుణాలు ఎన్ని అందించినా... అన్నదాతలు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో కుదేలవుతున్నారు. పండ్లతోటలకు పెట్టింది పేరైన రాజంపేట డివిజన్‌లో లక్ష ఎకరాల్లో పండ్లతోటలు సాగు చేస్తున్నారు. మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మ పంటలను విరివిగా సాగు చేస్తూ వాటిపైనే జీవనం సాగిస్తుంటారు. ప్రస్తుతం గతనెల చివరి నుంచి బొప్పాయ పంట దిగుబడి ప్రారంభమైంది. దిగుబడి ప్రారంభంలో కిలో బొప్పాయి ధర ఏకంగా రూ.16 పలికింది. భారీస్థాయిలో డిమాం డ్ ఉండడంతో రైతులు ఆనందపడ్డారు. ఇంతలో ఏమైందో ఏమోకాని దిగుబడి మొదలై కాయలు ఒక్కసారిగా కోతలు కోయడంతో డిమాండ్ తగ్గింది. కిలో రూ.16 నుంచి రూ.8కి పడిపోయింది. ధరల పతనంపై రైతులు ఆందోళన చేసినా.. ఏకంగా బొప్పాయి వ్యాపారులు, దళారులు రైతులతో కలెక్టర్ మాట్లాడినా ప్రయోజనం లేకుం డా పోయింది. కిలో రూ.8కి కొనే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఈ సమయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో రాజంపేట సబ్‌కలెక్టర్ స్పందించి ధరలు తగ్గిస్తే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ, ఉద్యానవన అధికారుల పర్యవేక్షణలో సమావేశాలు నిర్వహించి రైతులకు భరోసా ఇచ్చా రు. ఏకంగా ధరలు తగ్గిస్తే వెంటనే చర్యలు చేపడతామం టూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. అయినా బొప్పాయ పంటను కిలో రూ.8కు కొనడంలో కూడా వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. కారణం పంటదిగుబడి ఒకేసారి రావడంతో దిగుబడికి తగ్గట్టు డిమాండ్ లేకపోవడంతో ధరలు పతనమయ్యాయి.

అరటి రైతులకు అధిక లాభాలు

ఈ ఏడాది అరటి రైతుల పంట పండింది. గత నాలుగు నెలలుగా రికార్డు స్థాయిలో ధరలు పలుకుతున్నాయి. రాజంపేట డివిజన్ ప్రాంతంలో దాదాపు 30 వేల ఎకరాల్లో అరటి సాగవుతోంది. నాలుగు నెలల నుంచి కిలో రూ.17 ధర నిలకడగా సాగుతోంది. గత ఐదేళ్ల కిందట ఇదే పరిస్థితి ఉండేది. ఇప్పుడు కూడా కిలో ధర రూ.17 నాలుగు నెలలుగా ఉండడంతో గెలకు కనీసం రూ.500 రూపాయలు ఆదాయం వస్తోంది. ఒక ఎకరాకు వెయ్యి చెట్లకు 4 లక్షల నుంచి 5 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను రూ.2లక్షల నుంచి 3లక్షల ఆదాయం వస్తోంది. దీంతో అరటి రైతులు ఆనందంలో ఉన్నారు. ఇక ఈ యేడా ది వేసవికాలంలో ఈదురుగాలులు లేకపోవడంతో అరటి రైతులకు బాగా కలిసి వస్తోంది.




రాజంపేట ప్రాంతంలో పెద్దత్తున సాగైన అరటి

బొప్పాయ పంటను అర్ధాంతరంగా తీసివేసి...

రాజంపేట డివజన్‌లో 30వేల ఎకరాల్లో బొప్పాయ పంట పండుతోంది. ఈ స్థితిలో భారీఎత్తున ధర పడిపోవడంతో ఏకంగా వంద కోట్ల రూపాయల ఆదాయాన్ని రైతులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. చేసేది లేక కొందరు రైతులు బొప్పాయి పంటను అర్ధాంతరంగా తీసివేసి ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే స్థితిలో గత నాలుగు నెలలుగా సాగిన మామిడి పంట వ్యాపారం కోడూరు నుంచే రూ.200 కోట్ల వరకు జరగాల్సి ఉండగా డిమాండ్ లేక... కాయలను రోడ్లపై పారవేసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కిలోకు రూ.4 సబ్సిడీ ఇచ్చినా కోసిన కాయలకు కూలీ ఖర్చులు కూడా లేకపోవడంతో రూ.200 కోట్ల వ్యాపారం 50 కోట్లకు పడిపోయంది. 25 వేల ఎకరాల్లో సాగయ్యే మామిడి పంట ఎందుకు కొరగాకుండాపోయింది. దీంతో మామిడి రైతులు ఏమి చేయ లేక చెట్లను తొలగించి.. ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపుతున్నారు.

గండికోట ప్రాజెక్టులో 20.38 టీఎంసీల నీటిమట్టం



గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. 20.38 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోటప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 10,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటిని విడుదల చేస్తున్నామన్నారు. కాగా ఆదివారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 12,900 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 11,000 క్యూసెక్కులు ఉందన్నారు. కాగా పైడిపాలెం రిజర్వాయిర్‌కు 500 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి... సౌదీలో కుమారకాల్వ వాసి మృతి



నూర్ బాష (ఫైల్)

చక్రాయపేట,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషించు కునేందుకు కువైట్‌కు వెళ్లిన మండలంలోని కుమారకాల్వ గ్రామానికి చెందినషేక్ నూర్ బాష (38) మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకెళితే... చక్రాయపేట మండలంలోని కుమారకాల్వ గ్రామానికి చెందిన నూర్‌బాష బతుకు దెరువుకోసం 15 సంవత్సరాలుగా గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాకు వెళ్లి... ఒక కంపెనీలో కార్మి కుడిగా పనిచేస్తున్నాడు. సెలవుపై ఇండియాకు వచ్చి దాదాపు ఐదు నెలల క్రితం మళ్లీ సౌదీకి వెళ్లిపోయాడు. ఆదివారం 9 గంట లకు (ఇండియా కాలమానం ప్రకారం 12.30) నూర్ బాష డ్యూటీ కోసం సిద్ధమయ్యేందుకు తన గదిలో ఉన్న బాత్రూంలోకి కాలకృ త్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కిందపడిపోయి మృతి చెందాడు. ఈ విషయం అక్కడ ఉన్న తోటి స్నేహితులు తెలిపారన్నారు. నూర్ బాష మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వదేశానికి త్వరగా తెప్పించేం దుకు రాష్ట్రప్రభుత్వం సాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైదుకూరు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు నుంచి వనిపెంటకు వెళ్లే రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులో మోటర్‌సైకిల్ అదుపు తప్పి కింద పడటంతో గుగ్గిళ్ల జగదీష్ (18) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు... శనివా రం రాత్రి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మకాలనీకి చెందిన జగదీష్ పనిమీద గంజికుంటకు వెళ్లి తిరిగి వస్తుండగా మోటర్‌సైకిల్ అదుపు తప్పి కల్వర్ట్‌లో పడ్డాడు. దీంతో తీవ్రగాయాలై అక్కిడకక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జ్వరంతో విద్యార్థి మృతి



బింగి రఘువరన్

వేంపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె శ్రీరామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బింగి రఘువరన్ (8) అనే విద్యార్థి తీవ్ర జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బింగి ఓబులేసు, భారతిలు స్థానిక శ్రీరామ్ నగర్‌లో నివాసముంటూ కూలిపనులు చేసుకునేవారు. వీరి ఒక్కగానొక్క కుమారుడు రఘువరన్ సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నాడు. కాగా, ఇంటి చుట్టుపక్కల చెత్తా చెదారం పేరుకుపోయి పారిశుధ్యం అధ్వాన్నంగా తయారై దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో వారం క్రితం రఘువరన్‌కు జ్వరం రాగా ఆసు పత్రిలో చికిత్స చేర్పించగా.. ఆదివారం ఉన్నట్లుండి మృతి చెందాడని బంధువులు చెబుతు న్నారు. అపరిశుభ్రత వల్ల ఈగలు, దోమలు ఎక్కువై జ్వరం వచ్చి మృతిచెందాడని బంధువులు వాపోయారు.

కారు, స్కూటర్ ఢీ - ఒకరికి గాయాలు

ఖాజీపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప, కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లె చెరువు వద్ద కారు స్కూటర్‌ను ఢీకొన్న సంఘటనలో మొయిళ్ల కాల్వ దివాకర్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే... పాటిమీదపల్లె గ్రామానికి చెందిన దివాకర్ ఆదివారం పెట్రోలు కోసం వెళ్లి తీసుకుని వస్తుండగా.. మైదుకూరు నుంచి కడప వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో దివాకర్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

● 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో 7ను అమలు చేసి డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాతపింఛన్ వర్తింపచేయాలనే డిమాండ్‌తో ఆగస్టు 25వ తేదీ సోమవారం వియవాడ ధర్నా చౌక్ వద్దచేపట్టే మహాధర్నా కార్యక్రమానికి కడప జిల్లాలోని డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు ఉద్యోగులు పాల్గొని వియవంతం చేయాలని జిల్లా డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం పిలుపునిచ్చింది. ఆదివారం కడపనగరం ఎన్జీఓ భవన్‌లో మహాధర్నా పోస్టర్‌ను డీఎస్సీ-2003 టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ గుజ్జల తిరుపాల్ ఆధ్వర్యంలో ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.శ్రీనివాసులు, డి.రవికుమార్, పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాష, ఏపీటీఎఫ్-1938 జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.నరసింహారావు, వైఎస్ఆర్‌టీఏ రాష్ట్ర నాయకులు సజ్జల రమణారెడ్డి, ఏపీటీఎఫ్ 257 జిల్లా నాయకులు రామచంద్రారెడ్డి, ఆపస్ జిల్లా ఉపాధ్యాయులు శ్రీనివాసులు మరియు డీఎస్సీ 2003 టీచర్స్ ఫారం జిల్లా కన్వీనర్లు ఉదయబాస్కర్, కె.వీరప్రతాప్, శోభారాణి ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు అంటే సెప్టెంబర్ 1, 2004 ముందే ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తయి ప్రభుత్వ పాలనాపరమైన విధానాల వలన పోస్టింగ్ ఆలస్యమైన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పింఛన్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కడప జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరు పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

కార్యవర్గసేవలు అభినందనీయం

కడప కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని కాంగ్రిగేషనల్ చర్చి కమిటీ కార్యవర్గం అందిస్తున్న సేవలు అభినందనీయమని పాస్టర్ మోహన్‌బాబు కొనియాడారు. పాత రిమ్స్ వద్ద గల కాంగ్రిగేషనల్ చర్చి 200 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించి పలువురు క్రైస్తవ గురువులు ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. నాడు లండన్ మిషనరీ వారు ఏర్పాటు చేసిన ఈ చర్చి కాలగమనంలో అభివృద్ధి చెందుతూ భక్తుల ప్రార్థనలతో అలరారుతోందన్నారు. ఆ చర్చి కమిటీ చైర్మన్ సంజీవరాయుడు, కార్యదర్శి విజయుడు, ట్రెజరర్ నోవా బెన్నీ,రాజ మనోహర్‌బాబు, ప్రసన్నకుమార్, సుశీలమ్మ, చర్చి కమిటి ప్రతినిధులు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఈశ్వరీదేవిమాత ఆలయ నిర్మాణానికి విరాళం



ఈశ్వరీదేవి అమ్మవారి పటం అందుకుంటున్న దాతలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి మాత ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలు విరాళంగా దాతలు అందజేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేట వాసి కె.శ్రీనివాసులు ఆచారి కుటుంబ సభ్యులు మఠాధిపతి వీర శివకుమారస్వామికి చెక్కు అందించినట్లు కార్యనిర్వహణాధికారి బీవీ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

బ్రౌన్‌గ్రంథాలయానికి బీరువా, పుస్తకాలు వితరణ

కడప మారుతీనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తప్పెట్ల కొత్తపల్లెకు చెందిన దివంగత మలిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పెన్నా సిమెంట్స్ విశ్రాంత జనరల్ మేనేజరు ఎం.సుబ్బారెడ్డి ఆదివారం సీపీ బ్రౌన్ భాష పరిశోధన కేంద్రానికి బీరువా, వంద పుస్తకాలు అందించారు. కాగా గ్రంథాలయానికి బీరువా, పుస్తకాలు వితరణ చేసిన సుబ్బారెడ్డిని అభినందించారు. పరిశోధన కేంద్ర సంచాలకులు ఆచార్య పార్వతి, భూతపురి గోపాల క్రిష్ణ శాస్త్రి, హరిభూషణ రావు, రమేశ్‌రావు, ఆచార్య పద్మ పాల్గొన్నారు.

పలు ఘటనల్లో కేసు నమోదు

పీలేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని చెన్నారెడ్డి కాలనీకి చెందిన ఓ వృద్ధురాలిపై దౌర్జన్యం చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరుకు చెందిన అన్వేష్, శ్రావణ్, సాబీర్, శ్యామ్, మహేంద్ర అనే వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. అదే విధంగా ఆగస్టు 15వ తేదీ సాయంత్రం స్థానిక కడప మార్గంలో ట్రాఫిక్ అంతరాయం కలిగించడమే కాకుండా స్థానికులకు ఇబ్బందులు కలిగించిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. విగ్రహ మంటపం వద్ద లోగోల ఆవిష్కరణ పేరుతో గ్యాస్ సిలిండర్‌తో పేపర్, పూలు రోడ్డుపై వెదజల్లుతూ ప్రజలకు కలిగిస్తుండడంతో ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఒక గ్యాస్ సిలిండర్‌తోపాటు ఒక పూలు వెదజల్లే మెషీన్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద కేసు దర్యాప్తు ముమ్మరం

● మృతుడి వివరాలు గుర్తింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని సీటీఎం గ్రామం రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని మృతదేహం వివరాలు వెలుగులోకి వచ్చాయని తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు పశ్చిమబెంగాల్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఖదీర్‌గా గుర్తించామన్నారు. పనులకోసం మదనపల్లె ఏరియాకు వలస వచ్చాడని, ఒంటిపై గాయాలు ఉండడంతో హత్య చేశారనే కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. రైల్వే బ్రిడ్జికు సమీపంలో మృతదేహం పడి ఉండడంతో ఎవరైనా రైల్ నుంచి తోశారా, లేక ప్రమాదవశాత్తు పడ్డారేమో అనే కోణంలో కదిరి రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. పూర్తి వివరాల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మహిళ ఆత్మహత్య కేసులో ఇద్దరు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో అక్కాయపల్లె శాస్త్రినగర్‌లో నివాసముంటున్న సుభాన్‌బీ తనను భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని విషద్రావం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనలో మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆమె భర్త బోధన చిన్న, మామ చిన్న సిద్దయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి.. రిమాండుకు తరలించినట్లు కడప తాలుకా సీఐ రెడ్డెప్ప తెలిపారు.

డాక్టర్ వైబీ రెడ్డి మృతి.. నేడు అంత్యక్రియలు



డాక్టర్ వైబీరెడ్డి

కడప, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీ వాసి డాక్టర్ వైబీ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం 12.00 గంటలకు బెంగుళూరులో మృతి చెందారు. వైబీ రెడ్డి కడప 7 రోడ్స్‌లో దాదాపు 15 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో ప్రజలకు సేవలందించారు. అనంతరం గ్రానైట్ మైన్ ఓనర్‌గా పేరు ప్రఖ్యాతులు గడించారు. ఈయనకు ఫాదర్ ఆఫ్ కడప మార్బుల్స్ అని బిరుదు కూడా ఉంది. ఈయన స్వగ్రామం సిద్ధవటం మండలం భాకరాపేట. భార్య, ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్ళు ఉన్నారు. పెద్ద కుమార్తె కుటుంబం ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడింది. చిన్న కుమార్తె కుటుంబం బెంగుళూరులో వ్యాపార రీత్యా ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు కడప హౌసింగ్ బోర్డు కాలనీలో వైబీ రెడ్డి స్వగృహం నుంచి అంతిమయాత్ర బయలుదేరి రామకృష్ణ హైస్కూల్ సమీపంలో గల హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



డాక్టర్ వైబీ రెడ్డికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంట్రాక్టర్ సింగారెడ్డి సుబ్బారెడ్డి

హామీ అమలయ్యేదెప్పుడో...!

● నీలాపురం వంకతో రాకపోకలకు ఇబ్బంది
● సుగాలితాండా ప్రజలకు ఇక్కట్లు



వంక ప్రవాహంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

దువ్వూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురం-సుగాలి తాండా మధ్యలో ప్రవహిస్తున్న వంకతో ఈ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వర్షాకాలంలో వంక నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. వంకకు పై తట్టు భాగంలో 600 ఎకరాలకు మేర రైతుల పొలాలు ఉన్నాయి. వంక మీదుగా తెలుగుగంగ జలాలు ప్రవహించి దువ్వూరు చెరువులోకి నీరు చేరుతుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులు నిమిత్తం బండ్లు, ట్రాక్టర్లు, కూలీల ఆటోలు అటు వైపు వెళ్లాలంటే రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను 15 ఏళ్లగా ఎదుర్కొంటున్నా ఎవరికీ పట్టడంలేదు. రాకపోకలు సజావుగా సాగేందుకు వంక మీదుగా పైపులు వేసి నీటి ప్రవాహం వెళ్లే ఏర్పాట్లను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇది కొంతవరకు ప్రజలకు, రైతులకు ఉపశమనం కలిగించినా శాశ్వత పరిష్కారం లభించలేదు.

నాయకుల హామీలు నీటి మూటలేనా...

ప్రభుత్వాలు ఏవైనా నాయకుల హామీలు నీటి మూటలుగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా డీఎల్ రవీంద్రారెడ్డి ఉన్న సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో కలెక్టర్ కృష్ణబాబు కూడా ఈ సమస్యను పరిశీలించారు. తదనంతరం వైసీపీ ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డి రెండు దఫాలు కొనసాగిన సమయంలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. వంక మీదుగా చిన్నపాటి బ్రిడ్జి నిర్మించాలనే ఉద్దేశ్యం అమలు కాలేదు. దీంతో ప్రజల ఇబ్బందికి పరిష్కారం లభించలేదు. ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ ఎన్నికయ్యాక ప్రజలు, నాయకులు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి అతీగతి కనిపించడంలేదు. వంక ఉధృతి కొనసాగిన సమయంలో నాయకులు పరిశీలించడం, మాటలతో మమ అనిపించడం తప్ప సమస్య పరిష్కారం వైపు దృష్టి సారించడం లేదని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం దిశగా బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆఫ్టర్ ఫిఫ్టీ ఇయర్స్..

● తంబళ్లపల్లె జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తంబళ్లపల్లె ఉన్నత పాఠశాల 1974-75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

తంబళ్లపల్లె, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974-75లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 50ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. దీనికి తంబళ్లపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదిక అయింది. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వీళ్లంతా కళాశాలలో అడుగుపెడుతూనే అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మళ్లీ చిన్నపిల్లల్లా మారిపోయారు. చదువుకునే రోజుల్లో తరగతి గదుల్లో పిలుచుకునే మారుపేర్లను తలుచుకున్నారు. తోటి మిత్రులతో పోటాపోటీగా సెల్ఫీలు తీసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. దాదాపు ఐదు దశాబ్దాల క్రితం బడిలో చేసిన అల్లరిని, మధురానుభూతులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆనంద బాష్పాలు రాల్చారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి క్రిష్ణప్ప, ఎల్ఐసీ నారాయణరెడ్డి, ఆడిటర్ చంద్రశేఖర్, మల్లికార్జున థియేటర్ కుళ్లాయి రెడ్డి, మెడికల్ సుధాకర, బాబు, హోటల్ దీన, డాక్టర్ విజయ్‌కుమార్, తొగట శంకర, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి బాష, రిటైర్డ్ పోస్టుమాస్టర్ రామచంద్ర, నలందా రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకట్రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం జడ్పీ హైస్కూలులో..

రామసముద్రం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరికెల జడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు. చదివిన పాఠశాలకు నీటిశుద్ధి యంత్రాన్ని అందించారు. అలాగే విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించడానికి రూ.లక్ష విలువైన క్రీడా వస్తువులు బహూకరించారు. కార్యక్రమంలో పాటశాల కమిటీ చైర్మన్ భవనేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణప్ప, హెచ్ఎం చలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రాఘవరెడ్డి

వాల్మీకిపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలు, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్ చేస్తామని సీఐ రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం వాల్మీకిపురంలోని జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాహనచోదకులు సీటు బెల్ట్, హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. రికార్డులు లేని వాహనాలను రోడ్డుపై అనుమతించబోమని, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో తల్లిదండ్రులే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

సీఐని సన్మానించిన టీడీపీ నాయకులు

వాల్మీకిపురం మండలంలోని చింతపర్తికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం సీఐ రాఘవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐని శాలువతో సత్కరించారు. సింగిల్‌విండో డైరెక్టర్ లంకిపల్లె మధు, నాయకులు, సుధాకర్‌రెడ్డి, జమీరుద్దీర్, అలి, ఎస్ఆర్ శ్రీనివాసులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడి రాజీనామా

మదనపల్లె టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథరెడ్డి తన పదవికి రాజీనామా చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండేళ్లుగా రెడ్డిసంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్న తాను వయస్సు మీద పడటం, కోశాధికారిగా పని చేసిన అంకిరెడ్డి మృతి చెందడంతో సంఘం అభివృద్ధి జరగడం లేదన్నారు. మిగతా సభ్యులు కూడా నిశబ్దంగా వుండిపోవడంతో కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్త కార్యవర్గం ఏర్పాటుకు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని ద్వారకనాథరెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వారపు సంతలో చిత్తడే చిత్తడి..

కలకడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలకడలో ప్రతి బుధవారం జరిగే వారపు సంత ప్రాంతం చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ఈ సంతకు స్థానికులతో పాటు సమీప మండలాలైన కలికిరి, కేవీ పల్లె, సంబేపల్లె నుంచి అధిక సంఖ్యలో ప్రజలు సరుకుల కొనుగోలు నిమిత్తం వస్తారు. అలాగే పరిసర గ్రామాల రైతులు, రాయచోటి, పీలేరు, గుర్రంకొండ, కలికిరి తదితర పట్టణాల వ్యాపారులు కూరగాయలు, నిత్యావసర వస్తువులు, దుస్తులు, పూజసామగ్రి, తినుబండారాలు, పండ్ల అంగళ్లు ఏర్పాటు చేస్తారు. అయితే ఇక్కడ అనువైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ముఖ్యంగా వర్షాలకు దుకాణాల ముందు నీరు నిలిచి బురదమయమవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా కొనగోలుదారులు కూడా అవస్థలు పడుతున్నారు. షెడ్లు అనువుగా లేకపోవడంతో వ్యాపారులు ప్లాస్టిక్ పట్టలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో గ్రామ పంచాయతీ వనరులకు వేలం పాటలు నిర్వహించగా వారపు సంతకు సంబంధించి రూ.18.2 లక్షల ఆదాయం చేకూరింది. ఏటేటా పంచాయతీ ఆదాయం పెరుగుతున్నా సమస్యలు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తిష్ఠ వేశాయనే విమర్శలున్నాయి. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కారించాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.


వారపుసంతలో ప్లాస్టిక్ పట్టల కింద దుకాణాలు

వైద్యశిబిరం విజయవంతం


వైద్య శిబిరానికి హాజరైన మహిళలు

కలకడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిగారి పల్లెలో ఆదివారం సంజీవని గ్రామీణ ఉచిత ఆర్యోగ పరిరక్షణ వైద్యశిబిరాన్ని విజయవంతం నిర్వహించినట్లు కోఆర్డినేటర్ శశికుమార్ తెలిపారు. శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరబిందో ఆర్థిక సాయంతో 51మంది మహిళలకు వైద్యపరీక్షలు చేసినట్లు ఆయన తెలిపారు. శిబిరానికి పరిసర గ్రామాల నుంచి హాజరైన 120 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే సర్వైకల్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మరెడ్డి, సభ్యులు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ జిలానీ, షబ్బీర్ పాల్గొన్నారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ

బి.కొత్తకోట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని పాశం వీధిలో వెలసిన సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం నూతనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్, కన్వీనర్ శేఖర్‌బాబు, సేవాదళ్ కోఆర్డినేటర్ శ్రీపాణి పాల్గొన్నారు.


ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం

హార్సిలీహిల్స్‌లో పూర్వ విద్యార్థులు


హార్సిలీహిల్స్‌లో గురువులతో పూర్వ విద్యార్థులు

బి.కొత్తకోట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ఆదివారం ఓ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక అట్టహాసంగా జరిగింది. బి.కొత్తకోటలోని ఓ ప్రైవేటుస్కూల్‌లో 1993-94లో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు మూడు దశాబ్దాల అనంతరం అందరూ కలవాలని భావించారు. ఒకరి నొకరు సమన్వయం చేసుకొని హార్సిలీహిల్స్‌లో రెండురోజుల పాటు ఆనందంగా గడిపే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. కుటుంబ సమేతంగా వచ్చి సాంస్కృతిక కార్యక్రమాలు, విందుభోజనాలు, ఆటపాటలతో సరదాగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువు లను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాదర్‌వలి, నిజాంబేగ్, శంకర్‌రెడ్డి, బొమ్మసాని రాజా, రఘు, మురళి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే.. ఆ రోడ్లన్నీ జలమయం

చిత్రం చెప్పిన సమస్య

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా పెద్దమండ్యంలో తారురోడ్లలన్నీ జలమయంగా మారాయి. ఆదివారం పలు మార్గాలలో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దమండ్యం బస్టాప్ ప్రాంతంలో రోడ్డు పక్కన తీసిన మురుగు కాలువలు మట్టితో పూడిపోవడంతో ఈ దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. బ్యాంక్ సమీపంలో మెయిన్‌రోడ్‌లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తారురోడ్ల మరమ్మతు పనులు జరిగిన సమయంలో లెవెలింగ్ పనులు సరిగా లేకపోవడంతో స్థానిక రోడ్లపై వర్షపునీరు నిలుస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో రోడ్డు మార్గంలో వెళ్లే పాదచారులకు వాహనరాకపోకల సమయంలో నీటి బురద పడుతోంది. పదేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధి కారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- పెద్దమండ్యం, ఆంధ్రజ్యోతి


పెద్దమండ్యం బస్టాప్ గ్రామీణ బ్యాంకు సమీపంలో జలమయంగా తారురోడ్డు

మోడల్ కాలనీకి మోక్షం

● రూ.25 లక్షలతో మురుగు నీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం

● మోడల్ కాలనీలో వసతుల కల్పనపై ఎమ్మెల్యే నల్లారి ప్రత్యేక చొరవ


పీలేరు మోడల్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీలేరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణ శివారు ప్రాంతం చిత్తూరు మార్గంలోని మోడల్ కాలనీ సమస్యలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'పేరు మోడల్... వసతులు ఢమాల్ కథనానికి అపూర్వ స్పందన లభించింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో మోడల్ కాలనీ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు. కాలనీలో యుద్ధప్రాతిపదికన మురుగునీటి కాలువలు, డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం కోసం మొదటి విడతలో రూ.25 లక్షలు మంజూరు చేయించారు. రూ.13 లక్షలతో డ్రైను, మురుగునీటి కాలువలు, సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మరో రూ.12 లక్షలతో కాలనీలో పలు వీధులలో 7 చోట్ల మురుగునీటి కాలువలు నిర్మిస్తున్నారు. ఇవికాక అదనంగా మరో రూ.15 లక్షల అంచనాలతో మురుగు నీటి కాలువల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు. దశాబ్దాలు తరబడి మోడల్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో పనులు వేగం పుంజుకున్నాయి. స్థానిక తెలుగుదేశం పార్టీ నేత వెంకట్రమణారెడ్డి పర్యవేక్షణలో పనులు చురుకుగా జరుగుతున్నాయి. కాలనీ ప్రజలు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కోర్టు అనుమతిచ్చినా.. స్వాధీనం చేయని భూమి

● రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం శూన్యం


భాగ్యమ్మకు చెందినట్లు బోర్డు నాటిన దృశ్యం

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తమకు పిత్రార్జితంగా వచ్చిన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, తమకు అనుకూలంగా కోర్టు అనుమతులు ఇచ్చినా.. తమను భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని బాధిత మహిళ ఎంఎన్ భాగ్యమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ బూర్లపల్లె గ్రామానికి చెందిన ఎంఎన్ బయ్యారెడ్డి భార్య భాగ్యమ్మకు సర్వే నంబర్ 433లో 18.54 ఎకరాల పైకి తమకు 3.25 సెంట్ల భూమిని తన బావగారైన ఎంఎన్ నాగరాజరెడ్డి అతని కుమారుడైన మనోహర్‌రెడ్డికి దాన విక్రయం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించాడని, మనోహర్‌రెడ్డి సంరక్షణ బాధ్యతలు తాను చూస్తున్నందున భాగ్యమ్మ పేరున నాగరాజరెడ్డి రాసిచ్చాడని తెలిపారు. దీంతో తన పేరుతో పాసుబుక్కు మంజూరు అయిందన్నారు. అయితే తనకు తెలియకుండా మనోహర్‌రెడ్డి బి.కొత్తకోటకు చెందిన వ్యక్తికి విక్రయించాడని, దీనిపై తాను 2013లో తంబళ్లపల్లె కోర్టులో కేసు దాఖలు చేశామన్నారు. ఈ కేసులో తనకు అనుకూలంగా కోర్టు ఆదేశించినా రెవెన్యూ అధికారులు తనను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈ విషయంపై అనేక మార్లు కలె క్టర్ దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఇంత వరకు తమకు న్యాయం జరగలేదని ఆమె వాపోయారు. సంబంధిత అధికారులు తన పేరు మీద పాసు పుస్తకాన్ని మంజూరు చేసి 1బీని పునరుద్ధరించాలని భాగ్యమ్మ అధికారులను కోరుతున్నారు.


కోర్టు ఆర్డర్‌ను చూపుతున్న బాధిత మహిళ భాగ్యమ్మ

సంచార జాతుల కోసం 'స్ఫూర్తి'


స్ఫూర్తి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సంచార జాతుల కోసం భారతీయ జనతా పార్టీ స్ఫూర్తి కార్యక్రమాన్ని ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సొసైటీ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో స్ఫూర్తి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కో-ఆపరేట్ సెల్ కో- కన్వీనర్ గోపాల్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు బండి ఆనంద్, పూల నాగరాజ, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న సర్పంచ్‌కు పరామర్శ


సర్పంచ్‌ను పరామర్శిస్తున్న శ్రీరాం చినబాబు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని చిప్పిలిలో జరిగిన దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న రాజంపేట పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, అవికే నాయక్ తాండా సర్పంచ్ నటరాజ్ నాయక్‌ను ఆదివారం టీడీపీ నాయకులు పరామర్శించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, ఐటీడీపీ అధ్యక్షుడు సాగర్‌కుమార్ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మహబూబ్‌ఖాన్, బండి అమర, శ్రీకాంత్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల ఆరోపణలపై విచారణ


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మచెరువు మిట్టలో ఉన్న వెలుగు స్వచ్ఛంద సంస్థకు వెనుక అక్రమ నిర్మాణాలు చేస్తునాన్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆదివారం తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి విచారణ నిర్వహించారు. వెలుగు సంస్థ వెనుకవైపున అక్రమంగా భవన నిర్మాణాలు చేస్తున్నారని, ఇందులో సొసైటీ రామచంద్ర, రెవెన్యూ అధికారుల హస్తం ఉంతని వచ్చే ఆరోపణల్తై ఇంటి నిర్మాణాలు చేస్తున్న అందరిని ఆధారాలతో తహసీల్దార్ కార్యాలయానికి రావాలని సూచించారు. నిర్మాణాలు చేపడుతున్న వారి ఆధారాలు, రెవెన్యూ రికార్డులను తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమకు 2008లో అప్పటి రెవెన్యూ అధికారులు పేదలుగా గుర్తించి ఇంటిపట్టాలను మంజూరు చేశారని తెలి పారు. కాగా తమకు కేటాయించిన స్థలాల్లో పెద్ద బండరాళ్లు ఉండడంతో నిర్మాణాలు చేసుకోవడానికి అనువుగా లేనికారణంగా ఆర్థిక కారణాలతో దశల వారిగా చదును చేస్తూ ఇప్పుడు నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. తహసీల్దార్ రికార్డులు పరిశీలించిన అనంతరం నిర్మాణ పనులు చేసుకోవచ్చని తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మదనపల్లె ఆర్టీసీ-1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి కోరారు. ఆదివారం టీడీపీ నాయకులు గిరిష్‌కుమార్, టెంపర్ రాజేష్, ప్రవీణ్‌రాయల్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని దుశాలువాతో సన్మానించారు. అనంతరం వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా నాగూర్‌వలి మాట్లాడుతూ ఆర్టీసీ అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారి సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. మదనపల్లె ఆర్టీసీ డిపోలను సందర్శించాలని మంత్రిని యఆహ్వానించామని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని, కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారన్నారు.

వివాదాస్పద స్థలంలో చదును పనులు

● అడ్డుకున్న పంచాయతీ అధికారులు


వివాదాస్పద పంచాయతీ స్థలంలో చదును పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

మదనపల్లె టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్‌లో రూ.3కోట్లకు పైగా విలువైన వివాదాస్పద స్థలంలో కొందరు ఎక్సవేటర్ పెట్టి చదును పనులు చేస్తుండగా ఆదివారం గ్రామ పంచాయతీ అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. తట్టివారిపల్లె పంచాయతీ పరిధిలోని 88, 89, 91 సర్వే నెంబర్లలో 23 ఎకరాల ప్రైవేటు స్థలంలో 30 ఏళ్ల క్రితం కొందరు లేఅవుట్ వేసి ఇళ్ల స్థలాలు విక్రయించారు. లేఅవుట్ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి 10కుంటల స్థలాన్ని రాసిచ్చారు. జాతీయ రహదారి పక్కనే వున్న ఈ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి పలువురు ప్రయత్నించారు. దీంతో మదనపల్లె డీఎల్‌పీవో తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పట్లోనే కొందరిపై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయమే కొందరు ఎక్సవేటర్లు, ట్రాక్టర్లు పెట్టి కోర్టు కేసు(వివాదాస్పద) స్థలంలో చదును చేస్తుండగా మాజీ సర్పంచ్ వేమారెడ్డి, తట్టి నాగరాజరెడ్డి వెళ్లి అభ్యంతరం తెలిపారు. దీంతో ఈ స్థలం విషయమై కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, అందుకే చదును చేయిస్తున్నామని సమాధానం ఇచ్చారు. ఇంతలో డీఎల్‌పీవో నాగరాజు ఆదేశాలతో తట్టివారిపల్లె పంచాయతీ కార్యదర్శి రవీంద్ర అక్కడి వెళ్లి చదును పనులను అడ్డుకున్నారు. కోర్టు నుంచి ఏవైనా ఉత్తర్వులు వుంటే సర్టిఫైడ్ కాపీలు తీసుకొచ్చి చూపాలని, డీపీవో, డీఎల్‌పీవోకు చూపించి వారి అనుమతితో వివాదాస్పద స్థలంలోకి రావాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. దీంతో ఆ స్థలంలో చదును పనులు నిలిపివేసి వెళ్లిపోయారు.


చదును పనులను అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, మాజీ సర్పంచ్ వేమారెడ్డి